# రాజీ మార్గమే రాజ మార్గం

- జిల్లా న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ



ప్రసంశాపత్రాలు అందజేస్తున్న ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ

నారాయణపేట, అక్టోబర్ 7 : రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 609, మక్తల్ స్టేషన్ పరిధిలో 530, మాగనూరు స్టేషన్ పరిధిలోని 257 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్ గురించి బాధితులకు వివరించి రాజీ కుదుర్చుకోవడానికి కృషి చేసిన కోర్టు డ్యూటీ అధికారులు ఎం.డీ అబ్దుల్, భీంరాజ్, రవీందర్‌నాయక్, ఏఎస్సై బాలకృష్ణను అభినందించి ప్రసంశాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జీలు మహ్మద్ ఉమర్, సయ్యద్ జాకియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## ఊట్కూర్ తాసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ఊట్కూర్, అక్టోబర్ 7: తాసీల్దార్‌గా శివశ్రీనివాస్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తాసీల్దార్ సతీశ్‌కుమార్ మాగనూర్‌కు బదిలీపై వెళ్లగా కలెక్టర్ కార్యాలయంలో తాసీల్దార్‌గా విధులు నిర్వహించిన శివశ్రీనివాస్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు పారదర్శంగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. పలువురు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రారెడ్డి, ఆర్ఐ వెంకటేశ్ పాల్గొన్నారు.



తాసీల్దార్ శివశ్రీనివాస్

## జోనల్ క్రీడలకు ఏర్పాట్లు పూర్తి



మైదానాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మరికల్, అక్టోబర్ 7 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఈనెల 14 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే జోనల్ క్రీడాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ ఆనురాధ తెలిపారు. శనివారం ఆమె పాఠశాల ఆవరణలోని మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిష్టాత్మంకగా నిర్వహించే జోనల్ పోటీలను మరికల్‌లో ఏర్పాటు చేశారన్నారు. గతంలో పోటీలను విజయవంతంగా నిర్వహించడంతో మరో సారి ఇక్కడే నిర్వహించేదుకు అవకాశం కల్పించారన్నారు. జోనల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్నాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

మరికల్, అక్టోబర్ 7: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నరని వెంటనే ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం అఖిలపక్షనాయకులు తాసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో రాంచందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మట్లాడుతూ ఆధార్ కేంద్రం విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఎంపీటీసీ గోపాల్, రమేశ్, హరీశ్‌కుమార్, రామకృష్ణ, గొల్లకృష్ణయ్య, వీరన్న, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'వేతన' సంబురం

- వేతనాల పెంపుతో ఆర్పీల హర్షం
- జిల్లాలో 55మందికి లబ్ధి
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు

నారాయణపేట టౌన్, అక్టోబర్ 7: గత నెలలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ లో (మెప్మా) పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో పేట జిల్లాలో పని చేస్తున్న ఆర్పీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు సంఘం సభ్యులకు బ్యాంకు, స్త్రీనిధి రుణాలు ఇప్పించడంలో ఆర్పీలు కీలక పాత్ర వహిస్తారు. వీధి విక్రయదారుల సర్వే చేయడం, రుణాలు ఇప్పించడం, పట్టణ ప్రగతి, ప్రభుత్వ సర్వేలు, హరతహారం, హెల్త్ క్యాంప్ నిర్వహించడం తదితర కార్యక్రమాల్లో ఆర్పీలు పాలుపంచుకుంటారు. ఈ సందర్భంగా వారు వేతనాలు పెంచాలని గత ప్రభుత్వాలకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. స్వరాష్ట్రం ఏర్పాటయ్యాకా బీఆర్ఎస్ ప్రభుత్వం వారి కష్టాన్ని గుర్తించి సరైన గుర్తింపు నిచ్చింది. 2019లో ఆర్పీల వేతనాలు రూ.4 వేలుగా పెంచిన ప్రభుత్వం, 2023 సెప్టెంబర్‌లో రూ. 4వేల నుంచి రూ.6వేలకు పెంచుతూ జీవో విడుదల చేసింది. దీంతో ఆర్పీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ తమ కష్టాన్ని గుర్తించి, మా కుటుంబాల్లో వెలుగులు నింపారని సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్పీలు (ఫైల్)

### 55 మందికి లబ్ధి

నారాయణపేట జిల్లాలో 3 మున్సిపాలిటీలు ఉన్నాయి. అందులో పేట మున్సిపాలిటీలో 31 మంది, మక్తల్ మున్సిపాలిటీలో 12 , కోస్గి మున్సిపాలిటీలో 12 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. ప్రభుత్వం పెంచిన వేతనంతో జిల్లాలోని మొత్తం 55 మంది ఆర్పీలకు లబ్ధి చేకూరనుంది.

### మరింత ఉత్సాహంగా పని చేస్తాం

మెప్మాలో 2008 నుంచి ఆర్పీగా పని చేస్తున్నాను. మమ్మల్ని ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. చాలీచాలని వేతనంతో ఎంతో ఇబ్బంది పడ్డాం. స్వరాష్ట్రంలో మా సేవలు, మా కష్టాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ సార్ రూ.4వేలు ఉన్న వేతనాన్ని రూ.6వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మరింత ఉత్సాహంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను జనాలకు తెలియజేస్తాం. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.



–సౌభాగ్య, ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు

## ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

- ఆర్డీవో రాంచందర్



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాంచందర్

మరికల్, అక్టోబర్ 7 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆర్డీవో రాంచందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోవు అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు అధికారులకు సహకరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అలజడులు సృష్టించొద్దన్నారు. ఓటరు జాబితాల్లో మార్పులు చేర్పులు, నూతన ఓటరు జాబితా తదితర వాటిపై అఖిలపక్ష నాయకులు పలు సూచనలు చేశారు. సమావేశంలో తాసీల్దార్ సునీత, అఖిలపక్ష నాయకులు సర్పంచ్ కస్పె గోవర్ధన్, రాజేశ్, కృష్ణయ్య, వీరన్న, హరీశ్‌కుమార్, శ్రీరాం, రామేశ్, రెవెన్యూ సిబ్బంది గోపాల్ రావు, ఆర్ఐలు సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను వివరించాలి



యువకులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

దామరగిద్ద, అక్టోబర్ 7: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి గడప గడపకు వివరించాలని బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ఆవుటి బస్వరాజ్ కార్యకర్తలకు సూచించారు. శనివారం మండంలోని సుద్దబంద తండాలో బస్వరాజ్ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి ఓట్లు వేయించాలని అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని యవకులను కలిసి కేసీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎస్.ఆర్.రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి బీఆర్ఎస్ ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ మీడియా మండల అధ్యక్షులు అంజి పుట్టి, కానుకుర్తి ఉప సర్పంచ్ జ్ఞానేశ్వర్, సంగారెడ్డి, నడిమించి శ్రీధర్, కేవీఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

మరికల్, అక్టోబర్ 7 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి అండర్-17 వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు కోచ్ బాలరాజు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్, పాఠశాల బోనఫైడ్‌తో రావాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 9059361606 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## ఉద్యోగాలకు ఎంపికైన వారికి సన్మానం

మరికల్, అక్టోబర్ 7: ఇటీవల పోలీసు ఉద్యోగాని, అగ్నివీర్‌కు ఎంపికైన యువకులకు ఆదివారం మండలంలోని పెద్ద చింతకుంట గ్రామంలో ప్రేరణ సమితి ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు ప్రేరణ సమితి నాయకులు దేవేందర్ గౌడ్ శనివారం ప్రకటనలో తెలిపారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



నందిని

మక్తల్, అక్టోబర్ 7 : జాతీయ స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు మక్తల్‌కు చెందిన విద్యార్థిని నందిని ఎంపికైందని విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్రీడా పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నందిని ఫుట్‌బాల్ కోచ్ జి. వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో క్రీడలో మెలుకువలు నేర్చుకొని జాతీయ స్థాయి జూనియర్ పుట్ బాల్ పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 8 నుంచి 13 వతేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో నందిని పాల్గొంటుందని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నందినిని పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

# పూర్వ విద్యార్థికి ఉపాధ్యాయుల సాయం

మాగనూర్ అక్టోబర్ 7: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి కొత్తపల్లి జనార్దన్‌కు శనివారం ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థి జనార్దన్ ప్రతి ఏటా సాధిస్తున్నాడన్నారు. బీద కుటుంబానికి చెందిన జనార్దన్ క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహకారంతో హైదరాబాద్‌లోని హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ చదువుతూ గత నెల కరీంనగర్‌లో నిర్వహించిన తెలంగాణ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్‌లో పాల్గొని రెండు స్వర్ణ పతకాలు సాధించాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని సన్మానికిరూ. 15 వేలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థిని సన్మానించి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు